హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 23.0

వారంతా రోజువారీ కూలీలు.. వయస్సు మీద పడినా కుటుంబానికి ఆసరాగా నిలవాలని తపించే మనస్సులు.. రోజంతా కష్టపడితే వచ్చే రూకలతో జీవితాన్ని గడుపుతున్న బడుగు జీవులు.. మిర్చి ఏరేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో అతివేగానికి బలయ్యారు. కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలతో పాటు మరో కూలీ మృతి చెందాడు. హృదయ విదారక ఘటన మోతె మండల కేంద్రం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల కుటుంబ సభ్యుల రోదనతో ఘటనా ప్రాంతంతో పాటు సూర్యాపేట ఆసుపత్రి ప్రాంతాలు కన్నీటి పర్యంతమయ్యాయి.

(మోతె / సూర్యాపేట సిటీ)


సూర్యాపేట జిల్లా మోతె మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో





అతివేగం.. కూలీల బతుకులు ఛిద్రం

- కూలీల ప్రాణాలు మింగిన అతివేగం
- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఐదుగురు కూలీలు మృతి
- మృతుల్లో భార్యాభర్తలు
- మోతె మండల కేంద్రంలో విషాదం

సూర్యాపేట జిల్లా మోతెలో కూలీలతో వెళ్తున్న ఆటోను బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు, మరో కూలీ మృత్యువాత పడ్డారు. రోజు మాదిరిగానే మోతె మండలంలో మిర్చి పంట ఏరేందుకు ఆటోలో వస్తుండగా ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అండర్‌పాస్ నుంచి బయటకు వస్తూ నర్సింహులగూడెం వైపు నుంచి హుస్సేనాబాద వైపు సర్వీస్ రోడ్డులో వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. అతివేగంగా ఢీకొనడంతో సుమారు 50 మీటర్లకు పైగా ఆటో పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి మట్టిరోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మునగాల మండలం విజయరాఘవాపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ(60), చెరుకు నారాయణమ్మ(60), రేపాల గ్రామానికి చెందిన పోకల అనుసూర్యమ్మ(65)లు అక్కడికక్కడే మృతి చెందారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న స్థానికులు, బస్సులోని ప్రయాణికులు గాయాలైన మిగతా కూలీలను 108 వాహనాల్లో సూర్యాపేటలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయరాఘవాపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ(58), కందుల గురువయ్య(63) మృతి చెందారు. మరో మహిళ సోమపంగు లక్ష్మీ పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ సోమపంగు పవన్‌తో పల్లపాటి మంగమ్మ, సోమపంగు అనుసూర్య, పల్లపాటి రాములమ్మ, కత్తి విజయమ్మ, బెల్లంకొండ సరస్వతి, నరహరి రామచంద్రమ్మలు సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అర సెకను తప్పినా...

రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బస్సు ఆటోను మధ్య నుంచి చివరి భాగంలో ఢీకొట్టింది. బస్సు కనురెప్ప పాటు ఆలస్యంగా వచ్చినా ప్రమాదం తప్పేది. రోడ్డు దాటిన తర్వాత అర నిమిషం వ్యవధిలో కొద్దిదూరంలోని కూలీలు వెళ్లాల్సిన చోటకు క్షేమంగా వెళ్లేవారు.

మృతులంతా నిరుపేదలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారు నిరుపేదలే. కూలి డబ్బులతో కుటుంబానికి ఆసరాగా ఉంటామని వెళ్తుంటారు. మృతుల్లో అందరు 58ఏళ్లకు పైబడిన వారు. అందరి పిల్లల వివాహాలు కాగా కూలి డబ్బులు కుటుంబానికి ఆసరాగా ఉంటాయని ఈ వయసులోనూ కష్టపడుతున్నారు. మృతుల్లో కందుల గురువయ్య, కందుల నాగమ్మలు వీరరాఘవాపురం గ్రామానికి దంపతులు. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ పరిపూర్ణ పరిశీలించారు. ఆయనతో పాటు ఖమ్మం, సూర్యాపేట, మధిర డిపోల డీఎంలు కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాద వివరాలను సేకరించారు. మృతుల బంధువులు బెల్లంకొండ స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


108 వాహనంలో క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు

ఆసుపత్రిలో మిన్నంటిన రోదనలు

మోతె ఘటనకు సంబంధించిన క్షతగాత్రులతో పాటు మృతదేహాలను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. ఒకరిపై ఒకరు తలలు వాల్చుకుని కన్నీరు పెట్టారు. ఈ దృశ్యాలు ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించాయి. చికిత్స జరుగుతున్న సమయంలో క్షతగాత్రుల బంధువులు అత్యవసర వైద్య విభాగం దగ్గరకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.


ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

ఉలిక్కిపడ్డ మోతె

మతో మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. తమ కళ్లెదుటే ముగ్గురు మహిళలు చనిపోవడం, తొమ్మిది గాయపడటం వారిని కలిచివేసింది. మండలంలో మిరప సాగు ఎక్కువగా చేస్తారు. స్థానికంగా కూలీలు లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి తీసుకువస్తుంటారు. అలా వస్తూనే బుధవారం కూలీలు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం రైతులను కలిచివేసింది.

వేగంగా అందిన చికిత్సలు

రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు జనరల్ ఆసుపత్రిలో వేగంగా చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో ఆసుపత్రికి చేరిన బాధితులకు ప్రథమ చికిత్సను అందించి, వైద్యపరీక్షలు నిర్వహించారు. కాళ్లు, చేతులు విరిగిన వారికి వెంటనే కట్టు కట్టి వైద్యం అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి వైద్యసేవల ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. సుమారు 10 మందికిపైగా వైద్యులు ప్రథమ చికిత్స వేగంగా అందించడంలో చొరవ చూపారు.

రేపాల, విజయరాఘవాపురంలో విషాదఛాయలు

మునగాల: రెక్కాడితే కానీ డొక్కాడని కూలీల కుటుంబాలు కూలిపోయాయి. విజయరాఘవాపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ(55), కందుల నాగమ్మ(56), కందుల గురువయ్య(65) రెమిడాల సౌభాగ్యమ్మ(55), రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్యమ్మ (60), మరో 8 మంది కూలీలతో కలసి మొత్తం 12మంది ఆటోలో కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. 10 రోజులుగా మిర్చి ఏరే పనులకు వెళ్తున్నారు. ప్రతి రోజూ కూలీ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండే వారి కుటుంబాలలో బస్సు మృత్యు రూపంలో విషాదం నింపింది. ఇదిలా ఉండగా మృతుల్లో విజయరాఘవాపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ ఒంటరి మహిళ. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కందుల గురువయ్య, నాగమ్మలు దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా, వారికి వివాహలయ్యాయి. వీరందరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో వృద్ధదంపతులిద్దరూ కన్నుమూశారు. దీంతో కుటుంబం తల్లడిల్లుతోంది. రెమిడాల సౌభాగ్యమ్మకు ముగ్గురు కుమార్తెలు కాగా వారికి వివాహలయ్యాయి. భర్త కొన్నేళ్ల కిందట మృతితో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహలయ్యాయి. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ఆమె కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది.

ఆదుకుంటాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మోతె మండలం జాతీయరహదారిపై ప్రమాద ఘటనపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు, ఎస్పీ రాహుల్‌హెగ్డేలను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఆయన హామీఇచ్చారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు: కలెక్టర్

మోతె ఘటనకు సంబంధించిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు ఆదేశించారు. ఆసుపత్రి చికిత్స పొందుతున్న వారిని ఎస్పీ రాహుల్‌హెడ్గేతో కలిసి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలను అందించాలని సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డిని ఆదేశించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్యసేవలను కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

ఉమ్మడి జిల్లాకు సాగుబడి

- కంపసాగర్‌లో వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం



త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం

నల్లగొండ, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నూతన వ్యవసాయ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఎనిమిది కళాశాలలు ఉండగా, ఈ కోర్సులకు విద్యార్థుల నుంచి డిమాండ్ పెరగడంతో నిజామాబాద్ జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. జిల్లాలోని త్రిపురారం మండలం కంపసాగర్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని కంపాసాగర్ ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పెద్దఎత్తున విస్తీర్ణంలో ఉండటంతో పాటు కంపసాగర్‌లో విత్తనోత్పత్తితోపాటు శాస్త్రవేత్తలు ఉండటం వల్ల అందులో కళాశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ కళాశాలను ఏర్పాటు చేసినట్లయితే వ్యవసాయ కళాశాలకు సార్థకత చేకూరనుంది.

కళాశాలకు అనువైన ప్రాంతంగా కంపసాగర్

త్రిపురారం మండలంలోని కంపసాగర్‌లో ప్రభుత్వ భూమి సుమారు 280 ఎకరాల వరకు ఉంది. కంపసాగర్ కృషివిజ్ఞాన కేంద్రానికి 50 ఎకరాలు కేటాయించారు. ఈ కేంద్రంలోనే కళాశాలను నిర్మిస్తారా? లేదా? కృషి విజ్ఞాన కేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో కళాశాల భవనం నిర్మిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నందున అధికారులు కంపసాగర్‌ను సందర్శించి నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందించనున్నారు. వ్యవసాయాన్ని ఆర్థికంగా లాభదాయకంగా, పర్యావరణపరంగా, సామాజిక న్యాయంగా మార్చడానికి ఈ కళాశాల ఉపయోగపడనుంది. సమాజ అభివృద్ధికోసం వ్యవసాయ విద్యను మరింత సమర్థవంతంగా చేయడంకోసం వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయన్ని మరింత లాభదాయకంగా చేయడానికి, రైతులకు సహాయంగా ఉండటానికి, వ్యవసాయంలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర పరిశోధనల ద్వారా రైతులకు మేలు చేయడంకోసం వ్యవసాయ కళాశాల ఉపయోగపడనుంది. వ్యవసాయ కళాశాలలో డిగ్రీ చేసే విద్యార్థులకు ప్రాథమికంగా, శాస్త్రీయంగా వ్యవసాయం ఎలా చేయాలనే దానిపై వారికి తర్ఫీదు ఇవ్వనున్నారు. ఈకళాశాలలో విద్యలో భాగంగా ఆత్మవిశ్వాసంతోపాటు సామర్థ్యాలను కూడా పెంపొందిస్తారు. విద్యార్థుల్లో వ్యవసాయ నైపుణ్యాలను పెంపొందించడం, వ్యవసాయ పరిశోధన ధోరణిని నేర్పించడంపై అవగాహన కల్పిస్తారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బదిలీ

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 28: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ బదిలీ అయ్యారు. ఈయనను హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. 2023 జూలై 29న సూర్యాపేట జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. జిల్లాలో పనిచేసిన ఏడు నెలల కాలంలో స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేశారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

‘పది’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

నిడమనూరు, నాగార్జునసాగర్,తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 28: వార్షిక పరీక్షల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. నిడమనూరు, నాగార్జునసాగర్, తిరుమలగిరి(సాగర్) మండలాల్లోని పలు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులతో పాటు విద్యార్థుల హాజరుశాతాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంలో చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.హెచ్‌ఎంలు నర్సిరెడ్డి, శేషు, ఉపాధ్యాయులు కవిత, సుల్తానా, రాణి, విమల, కృష్ణవేణి, పుష్పలత, శ్రీనివాస్, సైదానాయక్, వెంకన్న ఆయనవెంట ఉన్నారు.

మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలో

గెలుపు మలుపులెన్నో

- చైర్మన్ కాంగ్రె‌స్‌కు, వైస్‌చైర్మన్ బీజేపీకి
- చైర్మన్‌గా పోతంశెట్టి వెంకటేశ్వర్లు ఎన్నిక
- వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాయ దశరథ
- ఎన్నికకు దూరంగా ఉన్న బీఆర్ఎస్


భువనగిరి మునిసిపల్ చైర్మన్, కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్వర్లుకు మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు


చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ దశరథ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. కౌన్సిలర్ల జంపింగ్‌లతో అధికార మార్పిడి అనివార్యంగా మారుతోంది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో గత రెండు నెలలుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్, వైస్ చైర్మన్ పీఠాన్ని బీజేపీ సొంతం చేసుకున్నాయి. అదేవిధంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మునిసిపల్ వైస్ చైర్మన్‌గా కోతి సంపత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● భువనగిరి టౌన్, హుజూర్‌నగర్

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపల్ రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని క్యాంపు రాజకీయాలకు తెరలేపగా, చివరికి చైర్మన్ పీఠం కాంగ్రె‌స్‌కు దక్కింది. ఉత్కంఠ పరిణామాల నడుమ జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్‌గా బీజేపీకి చెందిన మాయ దశరథ గెలుపొందారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుడితో కలిపి 36 మందికి 30 మంది హాజరయ్యారు. వీరిలో 29మంది కౌన్సిలర్లుండగా ఎక్స్‌అఫీషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వచ్చారు. కోరం సమకూరిన వెంటనే చైర్మన్ పదవులకు నామినేషన్లను కోరుతూ అప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లును పేర్కొంటూ ఆ పార్టీ విప్ అందజేసిన లేఖను చదివి వినిపించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు కాంగ్రెస్ అభ్యర్థిగా 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లును 11వ వార్డు కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్‌రెడ్డి ప్రతిపాదించగా 28వ వార్డు కౌన్సిలర్ కైరంకొండ వెంకటేశ్ బలపర్చారు. అనంతరం బీజేపీ అభ్యర్థిగా 22వ వార్డు కౌన్సిలర్ బొర్ర రాకేష్‌ను అదే పార్టీకి చెందిన 9వ వార్డు సభ్యురాలు నల్లమాస సుమ ప్రతిపాదించగా 21వ వార్డు సభ్యుడు ఉదయగిరి విజయ్‌కుమార్ బలపర్చారు.

చైర్మన్ పదవి రేసులో బీఆర్ఎస్ దూరం

బీఆర్ఎస్ ఇటీవలి వరకు పాలకపక్షంగా ఉండి తాజాగా మూడు వర్గాలుగా చీలి కొద్దిమంది సభ్యులు హాజరైనప్పటికీ చైర్మన్, వైస్‌చైర్మన్ పోటీకి దూరంగా ఉన్నారు. అనంతరం చేతులెత్తే విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే కుంభం, 17 మంది సభ్యులు మొత్తంగా 18 మంది చేతులెత్తారు. అనంతరం బీజేపీ అభ్యర్థికి కేవలం ఆరుగురు మాత్రమే మద్దతు తెలుపడంతో కాంగ్రెస్ అభ్యర్థి పోతంశెట్టి వెంకటేశ్వర్లు చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆ వెంటనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం హాల్ నుంచి వెళ్లిపోయారు. అనంతరం నిర్వహించిన వైస్‌చైర్మన్ ఎన్నికకు బీజేపీ అభ్యర్థిగా 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథను అదే పార్టీకి చెందిన 24వ వార్డు కౌన్సిలర్ రత్నపురం బలరాం ప్రతిపాదించగా 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవిత బలపర్చారు. వైస్‌చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ తమ అభ్యర్థిని ప్రతిపాదించకపోవడంతో బీజేపీ అభ్యర్థి మాయ దశరథ ఏకగ్రీవంగా వైస్‌చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌కు ధృవీకరణ పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ కొండల్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్‌కుమార్, చెన్న స్వాతి, గోమారి సుధాకర్‌రెడ్డి, అంది శంకర్ గైర్హాజరయ్యారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ రాజీనామా

చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పూర్తయిన వెంటనే పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశ హాల్ నుంచి అసంతృప్తితో వెనుదిరిగారు. ఆ రెండు పదవులను ఆశించినప్పటికీ తమను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి నిరాశ పరిచారని పేర్కొంటూ పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తంచేస్తూ వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో 20వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ పచ్చర్ల హేమలత వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

హుజూర్‌నగర్ వైస్‌చైర్మన్‌గా సంపత్‌రెడ్డి



హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మునిసిపల్ వైస్‌చైర్మన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునిసిపల్ కార్యాలయంలో వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆర్డీవో జగదీశ్వరరెడ్డి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా 28 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ప్రత్యేక సమావేశానికి 24 మంది హాజరయ్యారు. కాగా వైస్‌చైర్మన్‌గా 3వ వార్డు కౌన్సిలర్ సంపత్‌రెడ్డి నామినేషన్ వేయగా 12వ వార్డు కౌన్సిలర్ వెలిదండ సరితరెడ్డి ప్రతిపాదించారు. 22వ వార్డు కౌన్సిలర్ ఆమోదించగా మిగిలిన 21మంది సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సంపత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ఆర్డీవో ప్రకటించారు. సమావేశానికి కాంగ్రెస్ కౌన్సిలర్ కస్తాల శ్రావణ్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు జక్కుల వీరయ్య, జక్కుల నాగేశ్వరరావు, దొంగరి మంగమ్మ గైర్హాజరయ్యారు. కాగా బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లలో ముగ్గురు అస్మానజీర్, కేఎల్ఎన్‌రావు, గంగరాజు హాజరై మద్దతు ఇచ్చారు. వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన సంతప్‌రెడ్డికి ప్రిసైడింగ్ అధికారి జగదీశ్వరరెడ్డి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


జిల్లాకేంద్రంలోని అక్షర పాఠశాలలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న నల్లగొండ ఎంఈవో అరుంధతి

8

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


జిల్లాకేంద్రంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

నల్లగొండ, ఫిబ్రవరి 28: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 14,944మందికి 14,252మంది విద్యార్థులు హాజరుకాగా, 692 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 12,714మందికి, 12,235మంది విద్యార్థులు హాజరుకాగా, 479మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,230మంది విద్యార్థులకు 2,017మంది పరీక్షలకు హాజరుకాగా 213మంది పరీక్షకు హాజరుకాలేదు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరిగాయి. తొలిరోజు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు 144సెక్షన్‌ను అమలు చేశారు. నిమిషం నిబంధనతో జిల్లాలో 18మంది విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదు.

గుర్తుతెలియని జంతువుల దాడిలో 110గొర్రెల మృతి

తుంగతుర్తి, ఫిబ్రవరి 28: గుర్తు తెలియని జంతువుల దాడిలో 110 గొర్రెలు మృతి చెందగా, మరో15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన దాయం రవీందర్‌రెడ్డి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గొర్రెలఫాంలో 250గొర్రెలను పెంచుతున్నాడు. గొర్రెలను ఫాంలో ఉంచి, ఫాంహౌస్ పక్కన ఉన్న గదిలో నిద్రపోయాడు. బుధవారం ఉదయం నిద్రలేచేసరికి 110గొర్రెలు మృతి చెంది, మరో 15గొర్రెలు తీవ్రంగా గాయపడి ఉన్నాయి. ఈ సమాచారాన్ని వెంటనే వెంపటి పశువైద్యాధికారి మమతకు తెలియజేయగా, ఆమె అక్కడికి చేరుకుని కళేబరాలను పరిశీలించారు.



కుక్కలు, తోడేళ్ల, నక్కల వంటి జంతువుల దాడిలో ఇలాంటి ఘట నలు జరుగుతాయని పశువైద్యాధికారి తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. గొర్రెల పెంపకందారుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గొర్రెల మంద చుట్టూ ఫెన్సింగ్ ఉండగా, ఒక చోట పైకిలేపి ఉందన్నారు. తనకు రూ.15లక్షల విలువైన నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరాడు.

ఇరిగేషన్ డీఈఈ పై చర్యలు తీసుకోవాలి

నాగారం, ఫిబ్రవరి 28: సూర్యాపేట జిల్లా నాగారం ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ వడ్డే పరశురాములు, ఈదుల కిరణ్, వర్ధమానుకోట రైతులు వంగూరి సోమ నర్సయ్య, వడ్డే వెంకటయ్య, మేడి మల్లేష్ తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం వర్ధమానుకోటలో విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలోని వర్ధమానుకోటలో పెద్దచెరువులో చేపలు పట్టడానికి చేపల కాంట్రాక్టర్ నీటిని బయటకు వదులుతున్నాడని తెలిపారు. చెరువులో నీటిని బయటికి వదులుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఈ పిచ్చయ్యకు ఫిర్యాదు చేయగా, పొంతనలేని సమాధానాలు చెబుతూ చేపల కాంట్రాక్టర్‌కు సహకరించేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. చేపల కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్న డీఈఈ పిచ్చయ్యపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుని, చెరువును ఎస్సారెస్పీ జలాలతో నింపి పైర్లను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఇటుకాల మహేందర్, ఈదుల రమేష్ జలందర్, రమేష్, పి.కిరణ్ పాల్గొన్నారు

● వర్ధమానుకోట పెద్ద చెరువులో నీటిని బయటికి వదలడానికి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని డీఈఈ పిచ్చయ్య తెలిపారు. చేపల కాంట్రాక్టర్‌కు సహకరించలేదన్నారు. చెరువు నీటిని అనధికారికంగా తొలగించినవారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ అయిన చెరువును ఎస్సారెస్పీ జలాలతో రెండో రోజుల్లో నింపుతామన్నారు.



వర్ధమానుకోట గ్రామంలో మాట్లాడుతున్న రైతులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం, ఫిబ్రవరి 28: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని పేర బోయిన్స్ గూడెంలో బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకటరెడ్డి తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ట్రాక్టర్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ ... తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణ ... రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీ నరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజేష్ భక్తులు పాల్గొన్నారు

మిగులు భూమిని మింగేశారు!

- చేనేత సంఘానికి 20గుంటల కేటాయించిన ప్రభుత్వం
- మిగులు 10గుంటల రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం
- కొనుగోలు పేరుతో కోట్ల విలువైన భూమి స్వాహా
- మునుగోడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దందా

మునుగోడు, ఫిబ్రవరి 28: ప్రభుత్వ మిగులు భూమిని గుర్తించిన కొందరు నేతలు స్వాహా పర్వానికి తెరలేపారు. కొత్తగా చేనేత కార్మికుల పేరుతో ఏర్పాటు చేసిన అసోసియేషన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పేరున గ్రామపంచాయతీ రికార్డుల్లో సైతం ఆ స్థలాన్ని నమోదు చేయించారు. పక్కన ఉన్న భూమిని కూడా కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకొని అధికారికంగా హక్కులు పొందారు. మునుగోడులో రెండేళ్ల క్రితం జరిగిన ఈ అక్రమ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో బాధిత నేత కార్మికులు, వివిధ ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమానికి కొందరు అధికారులు సహకారం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

స్వాహా పర్వం తీరు

మునుగోడు నియోజకవర్గకేంద్రంలో చేనేత కార్మికులు తమ వృత్తి నైపుణ్యత పెంచుకోవడంతో పాటు తయారు చేసిన వస్త్రాలు వంటి వివిధ సరుకులను సొంతంగానే విక్రయించడానికి మార్కెట్ సౌకర్యంతో ఉపయుక్తంగా ఉంటుందని చేనేత సంఘం నేతలు ప్రభుత్వానికి విన్నవించారు. 2018లో అప్పటి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి వెంట ఉన్న సర్వే నెంబరు 78లో 20గుంటల విస్తీర్ణం భూమి కేటాయించింది. ఆ భూమికి చట్టప్రకారం హక్కులు కల్పించింది. అందులో మిగులుగా ఉన్న సుమారు 10గుంటల (1057చదరపు అడుగులు) స్థలంపై సొసైటీ నాయకులు కన్నేశారు. నేత బజారు వీవర్స్ అసోసియేషన్ అంటూ కార్మికుల పేరుతో 2019లో కొత్తగా సొసైటీని ఏర్పాటు చేశారు. సహకార సంఘం పాలకవర్గం నేతలే ఆ సొసైటీ కార్యవర్గంగా ఉన్నారు. గ్రామపంచాయతీ రికార్డులో సైతం ఆ స్థలాన్ని కూడా నమోదు చేయించారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని మార్కెట్ లెక్కల ప్రకారం కోట్ల రూపాయల విలువగల ప్రభుత్వ భూమిని ఆ నేతలే సొంతంగా రూ.17.59 లక్షలకు కొనుగోలు చేసినట్లుగా ఆ సొసైటీ పేరుతో తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పలు అనుమానాలు

ఇందులో అమ్మకందారులు ఇద్దరు, కొనుగోలు దారులైన నలుగురిలో అమ్మిన ఇద్దరూ ఉండడం గమనార్హం. ఈ తతంగం 2021లో జరిగినట్లు అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు రికార్డులు రుజువు చేస్తున్నాయి. కానీ ప్రభుత్వం ఇచ్చిన 20గుంటల భూమికి ధ్రువీకరణ పత్రం సొసైటీ పేరున ఉన్నట్లు చూపిన విధంగా 10గుంటల భూమికి ఎలాంటి ధ్రువీకరణ పత్రం లేనట్లు తెలిసింది. అదే భూమిని రిజిస్ట్రేషన్ ద్వారా మార్పిడి చేయించారు. అందులో అమ్మకందారులే కొనుగోలు దారుల్లో ఉండడం, ఈ రెండు వేర్వేరుగా ఉన్న స్థలాల వివరాలు మాత్రం గ్రామపంచాయతీ రికార్డులో వరుస క్రమంలో నమోదు కావడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ తతంగం ఆలస్యంగా వెలుగు చూడడంతో కార్మిక సంఘాలు, వివిధ ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎవరి స్వప్రయోజనాల కోసం కాదని కేవలం కార్మికులు, సహకార సంఘం అభివృద్ధి కోసమే అంటూ సదరు నేతలు దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమి కాపాడి కార్మికుల శ్రేయస్సు కోసం ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.


మునుగోడులో చేనేత సహకార సంఘానికి కేటాయించిన ప్రభుత్వ స్థలం

రేకుల షెడ్ ధ్వంసం

చేనేత సహకార సంఘం నేతలు ఆ స్థలంలో చట్టూ బేస్‌మెంట్ ఎత్తులో పిల్లర్లను నిర్మించి రెండు గదుల వెడల్పుతో ఓ రేకుల షెడ్ నిర్మించారు. గత ఏడాది ఈదురు, గాలులకు ఆ షెడ్ రేకులు లేచి ధ్వంసమయ్యాయి. అవి మళ్లీ నిర్మాణం కాలేదు. అక్కడ కంపచెట్లు ఆవరించి ఉన్నాయి. మునుగోడు-చండూరు ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ స్థలాలు అభివృద్ధి కోసం ఉపయోగిస్తామన్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 20 గుంటలతో పాటు సుమారు 10గుంటలు స్థలం చొప్పున రికార్డులో వేర్వేరుగా నమోదైన విషయం వాస్తవమే అని అన్నారు. రిజిస్ట్రేషన్ విషయం మాత్రం తెలియదని పేర్కొన్నారు.

ప్రభుత్వ మిగులు భూమి ఆక్రమిస్తే చర్యలు

మునుగోడులో మిగులుగా ఉన్న ప్రభుత్వ భూమి విక్రయమై అక్రమం జరిగిందన్న విషయం మా దృష్టికి రాలేదు. భూమి అక్రమ వ్యవహారం జరిగినట్టు ఫిర్యాదు వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

● నరేందర్, తహసీల్దార్, మునుగోడు.

ప్రజలు కమ్యూనిస్టు పార్టీలను కాపాడుకోవాలి

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 28: పేద ప్రజలు, కార్మికులు, అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేసేవారు సమాజంలో తగ్గుతున్నారని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎర్రజెండాను, కమ్యూనిస్టు పార్టీలను కాపాడు కోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో కోతులాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన సీపీఐ నాయకుడు దివంగత కురిమిద్దె లింగయ్య ప్రథమ వర్ధంతిలో మాట్లాడారు. సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు, ప్రజల పక్షాన ఎర్రజెండా పోరాడుతుందన్నారు. నల్లగొండ జిల్లా పోరాటాలకు పుట్టిల్లు అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు నల్లగొండ జిల్లా ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎంతోమంది కమ్యూనిస్టులు వీర యోధులకు జన్మనిచ్చిన త్యాగాలగడ్డ నల్లగొండ జిల్లా అని అన్నారు. నల్లగొండ కాదు ఇది ఎర్రగొండ అని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాచకొండలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా లింగయ్య ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. రాచకొండ గుట్టల్లో మిగులు భూములను అర్హులైన గిరిజనులు పేదలకు పంపిణీ చేయాలని ఎన్నో భూ పోరాటాలు నిర్వహించి భూ పంపిణీ చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధిగా లింగయ్య ఎంతో కృషిచేశారన్నారు. అంతకుముందు లింగయ్య విగ్రహాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, స్మారక స్థూపాన్ని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, బచ్చనగొని గాలయ్య, దుబ్బాక భాస్కర్, పల్లె శేఖర్‌రెడ్డి, పొట్ట సత్యం, పొట్ట శంకరయ్య, చిలువేరు అంజయ్య, ఇద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడిస్తాం: పిడమర్తి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించి ఇంటికి సాగనంపుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రానికి చేరుకున్న మాదిగల జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ వర్గీకరణ హామీని నిలబెట్టుకోని బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా చేస్తామన్నారు. సబ్బండ వర్గాలకు అవసరం లేని ఎన్నో బిల్లులను పార్లమెంట్ ద్వారా ప్రవేశపెట్టారని అట్టడుగు వర్గాలకు అవసరమైన ఏ ఒక్క చట్టాన్ని పార్లమెంటు ద్వారా ప్రవేశపెట్టలేదన్నారు. ఇది కేవలం కార్పొరేట్ అగ్రకులస్తుల కోసం పనిచేసే పార్టీ మాత్రమేనని అలాంటి బీజేపీని రాష్ట్రం నుంచి తరిమేయాల్సిన బాధ్యత మాదిగలపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కావాలంటే బీజేపీని ఓడించాలన్నారు. తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రధాన పార్టీలు మాదిగలకు మూడు పార్లమెంటు స్థానాలు కేటాయించాలన్నారు. తెలంగాణ దళిత బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద కులమైన మాదిగలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దున్న కొండల్, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాతాకుల శేఖర్, మహా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు, బహుజన బొర్లెల్లి సురేష్, బెజవాడ శ్రవణ్, నక్క మహేష్, జోగు గణేష్, అదిమల్ల శంకర్, కౌన్సిలర్ ఏర్పుల రవి, పుల్లెంల సతీష్, నక్క సైదులు, కత్తి సైదులు, మీసాల మహేష్ పాల్గొన్నారు.


మాదిగల జోడో యాత్రలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

వెండిజోడు సేవోత్సవం



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం అలంకార వెండి జోడు సేవలు, నిత్య పూజాకైంకర్యాలు వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను మేల్కొలిపిన పూజారులు వేద మంత్రపఠనాలతో నిజాభిషేకం జరిపి తులసీదళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి వెండి జోడు సేవల్లో తీర్చిద్దిన అర్చక స్వాములు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, సహస్ర నామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండ పైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు, సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని యాగశాలలో గణపతి హవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.13,48,787 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

గోపలాయపల్లి క్షేత్రంలో చక్రతీర్థం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి క్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతర్థం నిర్వహించారు. ఆరు రోజులుగా పూజలందుకున్న స్వామివారి ఆయుధమైన చక్రాన్ని స్వామి వారి పుష్కరిణి వద్దకు చేర్చిన అర్చకులు వేద మంత్రాలతో చక్ర తీర్థం నిర్వహించారు. అంతకుముందు హోమం, పూర్ణాహుతి, బలిహరణ నిర్వహించారు. ఈ ఉత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఐస్‌క్రీం తయారీ: ఫ్యాక్టరీ సీజ్

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఘటన

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 28: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో అనుమతులు లేకుండా ఐస్‌క్రీంలు తయారు చేస్తున్న ఫ్యాక్టరీని పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఆలేరు ఎస్ఐ వెంకట శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలేరు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న డైరీ ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఐస్‌క్రీంలు తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం తనిఖీ చేశారు. ఆ ఫ్యాక్టరీకి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్‌క్రీం తయారు చేస్తున్నారని గుర్తించి వాటిని సీజ్ చేశారు. డైరీ ఐస్‌క్రీం ఫ్యాక్టరీ యజమాని మహ్మద్ చాంద్‌మియాపై కేసు నమోదుచేశారు. ఈ ఫ్యాక్టరీకి హైదరాబాద్, నల్లగొండలో ఉన్న పలు ఐస్‌క్రీం కంపెనీల నుంచి వివిధ రకాల ఐస్‌క్రీంలు ఇక్కడికి తెప్పించి, ఇక్కడి సిబ్బంది మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ విక్రయాలు కొనసాగిస్తున్నారు.


ఆలేరులో పోలీసులు సీజ్ చేసిన ఐస్‌క్రీంలు తయారు చేసే ఫ్యాక్టరీ

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తుంగతుర్తి, ఫిబ్రవరి 28: బైక్, లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిన్నెంల గ్రామానికి చెందిన అనంతుల నాగరాజు, అతని స్నేహితుడు మహేష్ బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనంతుల నాగరాజు బుధవారం ఉదయం మృతిచెందాడని తెలిపారు. నాగరాజు సోదరుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భువనగిరి రూరల్: అతివేగంగా అజాగ్రత్తగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం మోటర్ సైకిలిస్టును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన అనంత్‌కుమార్ మోటర్ సైకిల్‌పై రాయగిరి వైపునకు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

కొండమల్లేపల్లి: ముందు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకున్న డీసీఎం ఢీకొంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బుధవారం జరిగింది. మిర్యాలగూడ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం మండల కేంద్రంలో ముందు వెళ్తున్న మరో డీసీఎం సడన్ బ్రేక్ వేయడంతో వెనుకున్న బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ శివరాంరెడ్డికి స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్టు

శాలిగౌరారం, ఫిబ్రవరి 28: ఇంటి మరమ్మతుల విషయంలో తరచూ ఘర్షణలు పడుతు క్షణికావేశంలో ఇటీవల అన్నను చంపిన తమ్ముడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నకిరేకల్ పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి అరెస్టు వివరాలు వెల్లడించారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో చర్లపల్లి పద్మకు పెద్దకుమారుడు రాంబాబు, చిన్న కుమారుడు నవీన్ ఉన్నారు. తల్లితో కలిసి అన్నదమ్ముళ్లు ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇద్దరి మధ్య ఆరు సంవత్సరాలు నుంచి గొడవలు జరుగుతున్నాయి. పాత ఇంటికి మరమ్మతులు చేద్దామని, చెరిసగం డబ్బులు పెట్టుకుందామని అన్న రాంబాబు తమ్ముడు నవీన్‌ను అడిగాడు. తాను పైసలు ఇవ్వనని, తన వద్ద డబ్బులు లేవని నవీన్ చెప్పాడు. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని తమ్ముడు నవీన్ అన్న రాంబాబును ఈనెల 26న ఇంట్లో కత్తిపీటతో నరికాడు. తలపై బండరాయితో మోది చంపాడు. కేసును నమోదు చేసి విచారణ చేసిన అనంతరం నిందితుడు నవీన్‌ను గ్రామంలో బుధవారం అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును నకిరేకల్ సీఐ రాజశేఖర్ ఛేదించారు. ఈ సమావేశంలో శాలిగౌరారం ఎస్ఐ ఎం. ఐలయ్య, కానిస్టేబుళ్లు సతీష్, దేవేందర్, నాగయ్య, లింగయ్య ఉన్నారు. హత్య కేసును త్వరగా ఛేదించినందుకు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సిబ్బందిని అభినందించారు.

‘హరితాహారం’ మొక్కలు అగ్నికి ఆహుతి

మర్రిగూడ, ఫిబ్రవరి 28: రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితాహారం మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట నుంచి లెంకలపల్లి వెళ్లే రహదారి ఇరువైపులా హరితాహారం పథకం ద్వారా మొక్కలు నాటి పెంచారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ చెట్లకు నిప్పు అంటించడంతో కాలిపోతున్నాయి.



గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 28: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సూర్యాపేట జిల్లా కోదాడ మండల పోలీసులు బుధవారం పట్టుకున్నారు. విష్ణు, సాయి ఆంధ్రా నుంచి గంజాయి తీసుకొస్తుండగా పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డులో బుధవారం పట్టుకున్నట్లు సీఐ రజితరెడ్డి తెలిపారు. వారిని వద్ద 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

- సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్

డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, ఫిబ్రవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ అన్నారు. నల్లగొండ జిల్లా డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియాలలో బుధవారం సాగిన విజయ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కాశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగం చేసిన ఘనత నరేంద్ర మోదిదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు ఇప్పటికి రైతులకు రైతుబంధు ఇవ్వలేదని దుయ్యబట్టారు. రూ.500కే సిలిండర్ అన్న సీఎం రేవంత్‌రెడ్డి మొత్తం సిలిండర్ డబ్బులు చెల్లించాలని చెబుతున్నారని తెలిపారు. మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ఎలా అధికారం చేపడుతుందని ఎద్దేవా చేశారు. హిందువుల రామ మందిర నిర్మాణం 500 సంవత్సరాల కల నరేంద్రమోదీ నాయకత్వంలో సాకారమైందన్నారు. ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులను కాంగ్రెస్, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తిచేయాలని, దేవరకొండ ఖిల్లాతోపాటు దేవరచర్లను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. సాగర్‌లో కనిపిస్తున్న జాతీయ రహదారులు, వెలుగుతున్న లైట్లు, ఐదు కేజీల బియ్యం, ఉపాధి హామీ పనులు, సిమెంట్ రోడ్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుంభకోణాల పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధిక స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, నూకం నర్సింహారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తోంద న్నారు. తెలంగాణలో జాతీయ రహదారులు, రైల్వేమార్గాలు మంజూరు చేసిందన్నారు. ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వర్షిత్‌రెడ్డి, ఏటి కృష్ణ, లాలునాయక్, వానం నరేందర్‌రెడ్డి, బండారు ప్రసాద్, రాధిక, మౌనిక, నూకం నర్సింహరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌గాంధీ, మన్మధ్‌రెడ్డి, కేతావత్ లాలునాయక్, డాక్టర్ కళ్యాణ్‌నాయక్, నక్క వెంకటేష్‌యాదవ్, నివేదితరెడ్డి, గార్లపాటి జితేందర్, నారోజుపద్మ, నేతాళ్ల వెంకటేష్, బండారు ప్రసాద్, కంకణాల శ్రీధర్‌రెడ్డి, గుండాల వెంకటేష్‌యాదవ్, ఏటి కృష్ణ, జల్దా భాస్కర్, కొంపల్లి శ్రీనివాస్‌యాదవ్, మన్నెం రంజిత్‌యాదవ్, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉయ్యాల నర్సింహాగౌడ్, జానకిరామయ్య, బొడిగ సాంబశివగౌడ్, పేర్ల జితేందర్, కుంభం యాదగిరి, పాక నగేశ్, భూతరాజు భరత్ ఉన్నారు.


హాలియాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్

పేద జనబాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 28: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద జనబాంధవుడని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం కింద రూ. 500కే సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర నెలల్లోనే 4 పథకాలను అమలు చేసి ప్రజలపై తమకున్న నిబద్ధతను చాటుకున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణలో పదేళ్ల తర్వాత ఇప్పుడే ప్రజాపాలన ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, ఎంపీపీ నందినీరవితేజ, సునీత, కృష్ణయ్య, కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, కొమ్ము నాగలక్ష్మి, పందిరి అనిత, గుంజ శ్రీనివాస్, ఎంపీటీసీలు సాయి, జగ్గారెడ్డి, చలపతిరావు, సిద్దూనాయక్, వెంకటేశ్‌గౌడ్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ: మండలకేంద్రంలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం తూచా తప్పకుండా అమలుచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, ఎలిమినేటి సత్తిరెడ్డి, రాములు, చిన్న అంజయ్య, సుధాకర్, యాదగిరి, బండి హనుమంత్, రేవంత్, శంకర్, శేఖర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలి : బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 28: ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం తెలుగుపల్లిలో బుధవారం బొడ్రాయి వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అనంతరం తెలుగుపల్లిలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాన్‌యాదవ్, నాయకులు ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, జాల నర్సింహారెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, శిరందాసు కృష్ణయ్య, సిరాజ్‌ఖాన్, రుక్మారెడ్డి, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి : పల్లా


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 28: ఎన్నికల హామీలను అమలు చేయని కేంద్రంలోని బీజేపీని ఓడించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన బుధవారం నిర్వహించిన నియోజకవర్గ సమి తి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అ ధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చే యలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాడని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డి మాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందించాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దేప సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు, నాయకు లు పల్లా దేవేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, జయరాములు, పాండురంగారెడ్డి, రామస్వా మి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలి


సదస్సులో ప్రసంగిస్తున్న సీడీపీవో చంద్రకళ

హాలియా, మాడ్గులపల్లి, ఫిబ్రవరి 28: సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీవోలు గంధం పద్మావతి, చంద్రకళ అన్నారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో హాలియా పట్టణంతో పాటు మాడ్గులపల్లి మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. భ్రూణ హత్యల కారణంగా బాలికల నిష్పత్తి తగ్గుతుందని అన్నారు. పిల్లలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరిగితే హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను, దురాచారాలను రూపుమాపేందుకు, బాలికల అక్రమ రవాణా అరికట్టేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. అనంతరం హైదరాబాద్ డైరెక్టరేట్ నుంచి వచ్చిన సర్టిఫికెట్లను అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ కె.రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి, కరస్పాండెంట్ రేణుక, సూపర్‌వైజర్లు నాగమణి, రజిని, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, మరియమ్మ, అరుణశ్రీ, ఆశాలు పుష్ప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దఅడిశర్లపల్లి, ఫి బ్రవరి 28: గుడిపల్లి మండలంలోని కోదండపు రం గ్రామంలో రెండో తిరుపతిగా విరాజిల్లుతున్న పద్మావతీ గోదాదేవి సమే త వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళశాసనములు చేసినటువంటి ఈ దేవాలయంలో గురువారం స్వామివారికి అధ్యయనోత్సవం, తొళక్కంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్వామివారి కల్యాణోత్సవంలో వెయ్యి జంటలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

'దయానంద సరస్వతి' వేడుకలను జయప్రదం చేయాలి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 28: మహర్షి దయానంద సరస్వతి ద్విశత జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఆర్యప్రతినిధి సభ తెలంగాణ అధ్యక్షుడు విఠల్‌రావు అన్నారు. బుధవారం ఆర్యసమాజజ్ మందిర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యసమాజ్ ఏర్పాటు చేసి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్యప్రతినిధి సభ సౌజన్యంతో మార్చి 1,2,3 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఆర్యసమాజ్ మందిరంలో నిర్వహించనున్న జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

శాలిగౌరారం, ఫిబ్రవరి 28: శాలిగౌరారం మండల పరిధిలో ఉన్న మూసీ నదిలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎండీ అన్వర్‌హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక అవసరం ఉన్న వారు మనిమిద్దె, గురజాల, తుడిమిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక రీచ్‌లో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని ఇసుకను పొందాలన్నారు. అక్రమంగా ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఆయన హెచ్చరించారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వర్‌హుస్సేన్‌ను మండలంలోని రేషన్‌డీలర్లు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు దండ శంకర్‌రెడ్డి, శేఖర్, నర్సింహ, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


నల్లగొండ: సాందీప్ పాఠశాలలో ప్రదర్శన


మిర్యాలగూడ: ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్


ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు


కనగల్: ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కొత్త ప్రయోగాలకు సైన్స్ దోహదం

● జిల్లాలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

కొత్త టెక్నాలజీని కనుగొనేందుకు గాను సైన్స్ ప్రయోగశాలగా దోహదపడుతుందని, ప్రతి ఒక్కరి జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రయోగాలను పలువురు సందర్శించారు. బాల శాస్త్రవేత్తల ఆలోచనలకు ముగ్ధులైన విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించిన క్విజ్ పోటీలు, వ్యక్తృత్వ, వ్యాసరచన, సైన్స్ రంగోళి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.


చండూరు: సన్‌షైన్ పాఠశాలలో విద్యార్థులు


శాలిగౌరారం: జేఎంజే స్కూల్‌లో ప్రయోగాల ప్రదర్శన


ఓక్‌ట్రీ పాఠశాలలో సైన్స్‌ఫెయిర్


హాలియా: టైం పాఠశాలలో సీవీరామన్ చిత్రపటానికి నివాళి


అడవిదేవులపల్లి: శాస్త్రవేత్తల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


చిట్యాలరూరల్: వనిపాకలలో ప్రయోగాన్ని చూపుతున్న టీచర్లు


కొండమల్లేపల్లి : రెయిబో పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన


కట్టంగూరు: ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు


సాగర్: ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


వేములపల్లి : రావులపెంటలో సీవీరామన్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


నల్లగొండ కేపీఆర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మిర్యాలగూడటౌన్, హాలియా, నాగార్జునసాగర్, చింతపల్లి, కొండమల్లేపల్లి, మర్రిగూడ, దేవరకొండ, ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్ ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. నిమిషం నిబంధన కారణంగా పలు పరీక్షా కేంద్రాల్లో పలువురు విద్యార్థులను అనుమతించలేదు. దీంతో కొద్దిసేపు విద్యార్థులు బ్రతిమాలినా అధికారులు నిరాకరించడంతో విద్యార్థులు వెనుదిరిగి వెళ్లారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా గురువారం ఇంటర్ ద్వితీయ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఉదయం 8గంటలలోపే పరీక్ష కేంద్రంలో ఉండాలని అధికారులు సూచించారు.




మిర్యాలగూడ : పరీక్షకు డీసీఎంలో వచ్చిన విద్యార్థులు

● మిర్యాలగూడ పట్టణంలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు రెండు, మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు విద్యార్థులను అధికారులు అనుమతించలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి ఇద్దరు బాలురు, ఒక బాలిక ఆలస్యంగా రావడంతో విద్యార్థులు వెనుదిరిగారు.

● హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 396 మంది విద్యార్థులకు గాను 352 మంది విద్యార్థులు హాజరుకాగా 44 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఆలస్యంగా వచ్చిన ముగ్గురు విద్యార్థినులను అధికారులు అనుమతించలేదు దీంతో వారు కంటతడి పెట్టి వెనుతిరిగారు.

● నాగార్జునసాగర్‌లో 433మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా కేవలం 409మంది మాత్రమే హాజరైనట్లు సీఎస్ పాండరయ్య, డీవో పూర్ణచందర్ తెలిపారు. ఆలస్యంగా వచ్చిన ఐదుగురు విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదు. మాడ్గులపల్లికి చెందిన ఒక విద్యార్థి నల్లగొండ కేంద్రంలో అనుమతించలేదు.

● చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 190 మంది విద్యార్థులకు 8 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటిండెండ్ నోముల రామస్వామి తెలిపారు.

● కొండమల్లేపల్లిలో 266మంది విద్యార్థులకు 240 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమణకుమారి తెలిపారు. క్రాంతి జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో 193 మందికి 192 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ వా సిరాం తెలిపారు. ఎస్‌ఐ రామ్మూర్తి కొండమల్లేపల్లిలో పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

● మర్రిగూడలో 407 మందికి 349 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివ సర్వాపరాణి తెలిపారు.

● దేవరకొండలో బాలికల జూనియర్ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో వారిని అనుమతించలేదు.

టైలర్ల అభివృద్ధి కోసం కృషి చేస్తా : వీరేశం


నకిరేకల్‌లో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, హాలియా, మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 28: టైలర్ల కు అండగా ఉంటూ వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. టైలర్స్‌డే సందర్భంగా బుధవారం ఆయన మెయిన్ సెంటర్‌లో జెండా ఎగురవేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని అమలు చేసిందని మిగతా రెండింటిని త్వరలో ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టైలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు చామల సత్యనారాయణ, అధ్యక్షుడు వనం నరేందర్, నాయకులు చిట్యాల దావిద్, కాటబత్తిని రమేష్, యాదగిరి, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హావెల్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. టైలరింగ్ కార్మికులకు ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని, టైలర్ షాపులకు ఉచిత కరెంట్ అమలుచేయాలని టైలరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిటిపాముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల స్థాయిలో కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్లు నిర్వహించాలని, వయోవృద్ధులకు పింఛన్ అమలుచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ముసని యాదగిరి, రాము, శ్రీనివాసచారి, కొంగరి రవి, గడ్డం రమణయ్య, ఆదిమూల ఆంజనేయులు, గడ్డం కృష్ణ, చైతన్య, శ్రీను, బ్రహ్మచారి, హరిబాబు, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో మహిళా టైలర్లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమాబాయి, సరిత, శైలజ, చంద్రకళ, సుధారాణి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

నకిరేకల్, ఫిబ్రవరి 28: వ్యవసాయ కార్మికులకు కనీస వేతన జీవోను ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని అమరవీరుల భవన్‌లో బుధవారం జరిగిన వ్యకా.స.సమావేశంలో ఆయన మాట్లాడారు. 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని జీవోను జారీ చేసినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా కనీస వేతన జీవోను సవరించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో 31లక్షల కుటుంబాలకు మూడు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. సమావేశంలో వ్యకాస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారి అయిలయ్య, బొజ్జ చిన్న వెంకులు, సరోజ, కత్తుల లింగస్వామి, సిరిపంగి అంజనేయులు, లకపక రాజు, లింగయ్య, బక్కయ్య, బాలయ్య, ఆంజనేయులు, యల్లయ్య, భిక్షం పాల్గొన్నారు.

పబ్లిక్ ఎజెండా
public agenda

మూసీ నీటితో చెక్ డ్యాంలు నింపాలి : మాడ్గులపల్లి: మండలంలోని పాలేరు వాగుపై ఉన్న ఆగామోత్కూర్, బొమ్మకల్, కల్వలపాలెం, సల్కునూరు గ్రామాల్లో ని చెక్ డ్యాంలలో నీరు అడుగంటిపోతున్నాయి. చెక్ డ్యాంలలోని నీరు అడుగంటిపోవడంతో బోరుబావులకు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మూసీ నీళ్ల ద్వారా ఆగామోత్కూర్, బొమ్మకల్, కల్వలపాలెం, సల్కునూరు గ్రా మాల చెక్‌డ్యాంలను నింపితే రైతులకు మేలు జరుగుతుందని, ప్రభుత్వం చెక్ డ్యాంలను నింపేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

పారిశుధ్యం పట్టించుకోరూ....: మిర్యాలగూడ రూరల్ : గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పాటు చేశారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. మండలంలోని అవంతీపురంలో డ్రైనేజీలు, చెత్త తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టాలని గ్రామస్థులు వేడుకొంటున్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి: మిర్యాలగూడ టౌన్: పట్టణంలో జరుగుతున్న సాగర్‌రోడ్డు విస్తరణ పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు వేదన కలిగిస్తున్నాయి. అడపాదడపా, అరకొరగా సాగుతున్న పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధి దుకాణాలు, తోపుడు బండ్లు నడిరోడ్డుకు రావడంతో ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. గుంతల కారణంగా బేరాలు లేవని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాల పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పేకాట రాయుళ్లపై చర్యలు తీసుకోవాలి : దేవరకొండ: దేవరకొండ పట్టణ శివారులో జోరుగా పేకాట స్థావరాలు ఏర్పాటు చేసుకొని జూదం ఆడుతున్నారు. దేవరకొండ పట్టణ శివారు తోటలు, తాటికోలు, భీమనపల్లి శివారుల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. పేకాటకు బానిసలై చాలా మంది ఆర్థికంగా నష్టపోతున్నారని పోలీసులు పేకాట స్థావరాలపై దృష్టిసారించి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 28: ఆర్థిక, శారీరక, మానసికంగా వెనకబడిన వర్గం ఎవరైనా న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా జడ్జి దీప్తి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఉషోదయ హెచ్‌ఐవీ ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్వాతి మహిళా సంఘం సహకారంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఒక మనిషి లోక్ అదాలత్ ద్వారా కోర్టు సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, అధికారులు సునీత, మెప్మా పీడీ కరుణాకర్, హెచ్‌ఐవీ ఎయిడ్స్ నివారణ ఐక్య సంఘం కమ్యూనిటీ సభ్యులు, స్వాతి మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిర్యాలగూడ రూరల్, మాడ్గులపల్లి, ఫిబ్రవరి 28: జిల్లాలోని మిర్యాలగూడ, మాడ్గులపల్లి మండలాల్లో బుధవారం నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలు సతీష్, నరేష్ తెలిపారు.

● మిర్యాలగూడ మండలంలోని ఆలగడప మూసీనది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. నేరేడుచర్ల మండలంలోని రామాపురం, గుడుగుంట్లపాలెం, ఆలగడపకు చెందిన సామ తేజ, రాపోలు సైదులు, గుడ్ల రమేష్ ఆలగడప మూసీ వాగునుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని గ్రామ శివారులో గల పాలేరు వాగు నుంచి ఆగామోత్కూర్‌కు చెందిన సాయికుమార్ ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం పాల్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో ప్రయాణికులు 9959226308 నెంబరుకు కాల్ చేసి సమస్యలను తెలయజేయాలని కోరారు. సంస్థ అభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని బట్టు వెంకన్నబావితండాలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణనాయక్ ప్రారంభించారు.

చిట్యాలరూరల్: డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు, చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన శివశెట్టి గౌరయ్య మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ వేర్వేరుగా నివాళులర్పించారు.

నల్లగొండ టౌన్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన నేరటి మల్లేష్‌యాదవ్‌ని నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నల్లగొండ: యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీకి చెందిన వేముల శేఖర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

మిర్యాలగూడ: యువత ఉపాధి అవకాశాలను పొందేందుకు సాంకేతిక విద్యలో శిక్షణ అందించడం అభినందనీయమని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. రోటో కలం, మన మిర్యాలగూడ ఆర్గనైజేషన్ సహకారంతో సమారిటన్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించనున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

వేములపల్లి: బుడిగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి యువ నాయకుడు నిడుగొండ రామచంద్రు నియమితులయ్యారు.

నార్కట్‌పల్లి: దివంగత ఎమ్మెల్యే రాఘవరెడ్డి ప్రదర్శించిన జానపద కళారూపం 'పిట్టలదొర' ఒకే ఫ్రేంలో హాస్యం-వ్యంగ్యం కలబోతని ఓయూ పరిశోధక విద్యార్థి నర్రా ప్రవీణ్‌రెడ్డి అన్నారు. కేరళలో జానపద కళారూపాల జాతీయ సదస్సు, ఫోసిల్ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు.

ప్రెస్‌అకాడమీ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నేతలు


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 28: తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం హైదరబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డితో పాటు ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య సెల్ అధ్యక్షుడు దుర్గారావు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టులకు ఎంతగానో మేలు జరుగుతుందని అన్నారు. సుదీర్ఘకాలంగా ఆయన జర్నలిజంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వం ద్వారా పరిష్కారమయ్యేలా చేశారని కొనియాడారు.

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.